రైతు కష్టం రోడ్డు పాలు

- లారీలలో పరిమితికి మించి నింపుతున్న వరి బస్తాలు..
- ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ధర్మారం వద్ద తాడు తెగిపోవడంతో కిందపడిపోయిన ధాన్యం బస్తాలు



డిచ్‌పల్లి మండల కేంద్రంలో నడిరోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు

నిజామాబాద్ రూరల్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం లారీలలో లోడ్ చేసిన తర్వాత అలాట్‌మెంట్ అయిన రైస్ మిల్లులకు తరలించే లోపు సగం వరి బస్తాలు రోడ్డుపైనే పడిపోతున్నాయి. లారీల పరిమితికి మించి నింపడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ప్రయాణంలో లారీలకు కట్టిన తాడు వదులై సంచులు కిందపడి పగిలి పోయి ధాన్యం రోడ్డుపాలవుతోంది. శుక్రవారం డిచ్‌పల్లి మండలం ధర్మారం వద్ద, డిచ్‌పల్లి మండల కేంద్రంలో రెండు లారీల తాడులు తెగిపోవడంతో ధాన్యం బస్తాలు కిందపడిపోయాయి. లారీ డ్రైవర్ గమనించి మళ్లీ ధాన్యం బస్తాలను లోడ్ చేయించాల్సి వచ్చింది. కానీ ఈలోపే స్థానికులు సగం గింజలను మాయం చేశారు. కొన్ని రోడ్డుపైనే పోయాయి. ఈ కారణంగా రైతు నష్టపోవాల్సి వస్తోంది.

మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే రేకుల్‌పల్లి భూపతిరెడ్డి

సిరికొండ: సిరికొండ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా మారుస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. తాటిపల్లిలో రెండున్నర కోట్ల రూపాయలతో సబ్ స్టేషన్, చీమన్‌పల్లిలో రూ.2 కోట్లతో పీహెచ్‌సీ, కుర్దుల్‌పేట్‌లో రూ.20 లక్షలతో జీపీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేసి మైలారంలో సీసీ రోడ్లను ప్రారంభించారు. చీమన్‌పల్లి, తాటిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చీమన్‌పల్లి గ్రామస్తుడైన మాజీ ఎమ్మెల్యేను 40 ఏళ్లుగా సర్పంచ్, ఎంపీపీ, ఎమ్మెల్యేగా గెలిపించినా ఈ ప్రాంతాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బ్యాంకు ఏర్పాటు చేయిస్తానని, చెక్‌డ్యాంలు మంజూరు చేయిస్తానని తెలిపారు. తాటిపల్లికి వెళ్లే మార్గంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని, నిధులు త్వరలోనే మంజూరవుతాయని చెప్పారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీసీ కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, చందర్ నాయక్, ఉమ్మాజీ నరేష్, మండలాధ్యక్షుడు బాకారం రవి, సొసైటీ చైర్మన్ గంగాధర్, బాకారం సంతోష్, దేగాం సాయన్న, రాజారెడ్డి, రవినాయక్, సంతోష్‌నాయక్, బన్నాజీ, అంబర్‌సింగ్, నర్సింగ్, నర్సారెడ్డి, ప్రసాద్, బాల్‌రాజ్‌నాయక్, లింగారెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



తాటిపల్లిలో సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

క్లుప్తంగా

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ మహిళా నేతలు



కేసీఆర్‌తో కవిత, సుమన, విశాలిని

మోపాల్/ఇందల్వాయి: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి ఇందల్వాయి మాజీ జెడ్పీటీసీ గడ్డం సుమనారెడ్డి, మాజీ కార్పొరేటర్ చామకూర విశాలినీరెడ్డి ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా తాజా రాజకీయ పరిస్థితులను కేసీఆర్‌కు వారు వివరించారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

మోపాల్: మండలంలోని బాడ్సి సొసైటీ పరిధిలోగల బైరాపూర్‌లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నాయకుడు ఇందల్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. గ్రామంలో దాదాపు 70 శాతం నుంచి 80 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయని, నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. కోతలు పూర్తయిన రైతులు వర్షాలు కురుస్తాయని ఆందోళనకు గురవుతున్నారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే బైరాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, లేకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఇందల్ నాయక్ హెచ్చరించాడు.

పశువులకు టీకాలు వేయించాలి



కమ్మర్‌పల్లి: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కమ్మర్‌పల్లి మండల పశువైద్యాధికారి రాజశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం ఉప్లూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించి 72 గోజాతి, 109 గేదె జాతి పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవాలు గాలికుంటు వ్యాధి బారిన పడడం వల్ల నోటిలో పుల్లతో చొంగ కారడం, కాలి డెక్కలలో పగుళ్లు ఏర్పడి నడవలేకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, అబార్షన్లు అవడం వంటి లక్షణాలు ఏర్పడతాయన్నారు.

ఇందల్వాయి ఎస్సైగా సందీప్ బాధ్యతల స్వీకరణ



ఎస్సై సందీప్

ఇందల్వాయి: ఇందల్వాయి మండల ఎస్సైగా పని చేసిన బి.మనోజ్ బదిలీపై వెళ్లడంతో వీఆర్ నుంచి వచ్చిన జి.సందీప్ నూతన ఎస్సైగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు మండలంలో లా అండ్ ఆర్డర్‌ని పరిరక్షించేందుకు కృషి చేస్తానని ఎస్సై సందీప్ తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

ఇందల్వాయి: మూత్ర పిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన లక్కాకుల శ్రీనివాస్ అనే వ్యక్తికి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఐదు లక్షల రూపాయల ఎల్‌వోసీని ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఎల్‌వోసీ మంజూరు పట్ల వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు సుధాకర్, కర్సం మోహన్, ఆశిష్ తదితరులు ఉన్నారు.

వేద రక్షణకు ఉపనయనాలు



నిజామాబాద్ రూరల్: వేద పరిరక్షణకు పిల్లల్లో భక్తి వికాసం పెంపొందించడానికి సామూహిక ఉచిత ఉపనయనాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందూరు నగర బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో సుభాష్ నగర్ శ్రీ రామాలయం ప్రాంగణంలో ఈ నెల 23న 21 మంది వటువులకు ఉపనయన సంస్కార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంథని జయంత్ కుమార్, రొట్టె సురేష్ శర్మలు తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన కర పత్రాలను శుక్రవారం రామాలయంలో ఆవిష్కరించారు. రామాలయం కమిటీ కార్యదర్శి శోభా నవీన్ రెడ్డి, చంద్ర శేఖర శర్మ, అనురాధ, వీణ తదితరులున్నారు.

హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి మురళి

బీవోసీ రాష్ట్ర అధ్యక్షులు అనురాధ



మాట్లాడుతున్న అనురాధ

మోపాల్: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి, ఆదర్శ కమ్యూనిస్టు జెల్ల మురళి అని ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణాల కార్మిక సంఘం(బీవోసీ) రాష్ట్ర అధ్యక్షులు అనురాధ అన్నారు. శుక్రవారం నగర శివారులోని బోర్గాం(పి) శ్రామికనగర్ గూడెంలో జెల్ల మురళి సంస్మరణ సభ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోపిడీ వర్గ వ్యతిరేక విధానాలపై మురళీ పోరాడి శ్రామికుల పక్షాన నిలబడ్డారని తెలిపారు. పీడిత ప్రజలకు సమాన అవకాశాలు ఇవ్వాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరుకున్నారన్నారు. ఆయన జీవించిన కాలం కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి ఆదర్శంగా ఉన్నారని పేర్కొన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, నాయకులు వేల్పూర్ భూమయ్య, ఎస్ దాసు, నీలం సాయిబాబా, మల్లికార్జున్, పరుచూరి శ్రీధర్, సాయిబాబా, సూర్య శివాజీ, శివకుమార్ పాల్గొన్నారు.

భగవద్గీత, నాట్య శాస్త్రానికి యునెస్కో గుర్తింపుపై హర్షం



గీత భవనంలో భగవద్గీత పుస్తకాలతో ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్: భగవద్గీత, నాట్య శాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు దక్కడం పట్ల రైల్వే స్టేషన్ రోడ్డు అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి(గీత భవనం) కార్యవర్గ సభ్యులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. గీత భవనం ప్రధాన కార్యదర్శి మేడిచర్ల ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. శతాబ్దాలుగా దేశ నాగరికత విషయంలో చైతన్యాన్ని పెంపొందించిన పవిత్ర గ్రంథాలకు సుదీర్ఘ కాలం తర్వాత గుర్తింపు రావడం గొప్ప విశేషమని కొనియాడారు. అధ్యక్షుడు ఎం ఎస్ నరసింహ చారి, కోశాధికారి ఆరెట్టి లక్ష్మీ నారాయణ, వెంకట స్వామి, చంద్ర శేఖర శర్మ, బొడ్డు దయానంద్, గంగాధర్, షేర్ల దయానంద్, జీఎం శంకర్, నరేందర్ రావు షిండే తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



నడిపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



క్రీస్తు సందేశం వినిపిస్తున్న చర్చి ఫాదర్

డిచ్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను జరుపుకున్నారు. నడిపల్లి ఫాస్టరేట్ సీఎస్ఐ చర్చి, బర్ధిపూర్, విక్టోరియా హాస్పిటల్, కొరట్‌పల్లి, డిచ్‌పల్లి ఖిల్లా, దూస్‌గాం, ముల్లంగి(ఐ), ఘన్‌పూర్, కమలాపూర్, యానంపల్లి చర్చిలతో పాటు ధర్మారం(బి) గ్రామంలోని ప్రసిద్ధ లూర్ధుమాత చర్చిలో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు సందేశాలు వినిపించారు. పలువురు క్రైస్తవులు శిలువను మోశారు.

నిజామాబాద్ రూరల్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ మరణానికి సంబంధించి క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే గుడ్ ఫ్రై డే ఆరాధన ఉపవాస దీక్షల మధ్య ముగిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుండి తిరిగి ప్రారంభమైన ప్రార్థనలో సిలువపై యేసు మరణాన్ని గుర్తు చేసుకున్నారు.గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు సందేశాలు వినిపించారు.

జిల్లా జడ్జి సునీతకు సన్మానం



ఖలీల్ వాడి: జిల్లా జడ్జి సునీతా కుంచాల పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా జిల్లా న్యాయాధికార సేవా సంస్థ సమావేశ మందిరంలో న్యాయవాదులు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. మూడున్నరేళ్లలో జిల్లా ప్రజలతో మమేకమై న్యాయ సేవలు అందించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, డిఫెన్స్ కౌన్సిల్స్ రాజ్‌కుమార్ సుబేదార్, ఉదయ్ కృష్ణ, ప్రమోద్, విశ్వక్ సేన్ పాల్గొన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాది టక్కర్ హన్మంత్ రెడ్డి సరస్వతి మాత రాగి విగ్రహం అందజేసి శాలువాతో జడ్జిని సన్మానించారు.

వినాయక కల్యాణ మహోత్సవం

నిజామాబాద్ రూరల్: సిద్ధి వినాయక స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని గాయత్రినగర్ వద్ద గల సిద్ధి వినాయక స్వామి దేవాలయం 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు మచ్చ చంటయ్య మాట్లాడారు. భక్తులకు అన్నదానం చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీందర్

నిజామాబాద్ రూరల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కేంద్రంలోని కోటగల్లి సొసైటీ చైర్మన్ కొట్టాల రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ ఆధ్వర్యంలో సాయినగర్ ఆకుల పాపయ్య రోడ్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని సొసైటీకి తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలన్నారు. నాణ్యమైన వరి ధాన్యం తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు, సీఈవో వంశీకృష్ణ, రైతులు హన్మాండ్లు, గంగాధర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఖలీల్‌వాడి: నిజామాబాద్ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఖానాపూర్ ఆర్కే ఇండస్ట్రీస్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఇండస్ట్రీలో పనిచేసే కార్మికులకు, యాజమాన్యానికి అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు శుక్రవారం తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది కె.సుమన్, బి.కిరణ్ కుమార్, ప్రశాంత్ గౌడ్, సురేందర్, కార్మికులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పంపిణీ ఎప్పుడో?

- ఇళ్ల నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయని వైనం
- ఆగ్రహించి ఇళ్లల్లోకి చొరబడిన స్థానికులు
- ఇళ్లు సీజ్ చేసి, తాళాలు వేసిన అధికారులు



ధర్పల్లిలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు



ఇళ్ల తాళాలు తొలగిస్తున్న స్థానికులు (ఫైల్)



ఇళ్లల్లోకి చొరబడిన స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు (ఫైల్)

ధర్పల్లి: పేదల సొంతింటి కల నెరవేరేస్తామంటూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం నిరుపేదల ఆశలను ఆవిరి చేశాయి. నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో వృథాగా ఉండిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ధర్పల్లి మండల కేంద్రంలో 48 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించారు. ఒక్కొక్క ఇంటికి రూ.6 లక్షల చొప్పున రూ.2.88 కోట్లు కేటాయించారు. మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిన్నపాటి పనులు చేయాల్సి ఉంది. ఇళ్ల పంపిణీకి నోచుకోక వృథాగా ఉంటున్నాయి. అర్హులను గుర్తించే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ ఇళ్లలో డ్రైనేజీలు, రోడ్డు నిర్మాణం, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలి. ఇప్పుడు ఈ సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామానికి చెందిన నిరుపేదలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వినతి పత్రాలను కూడా అందజేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో మౌలిక సదుపాయాలను కల్పించి, అర్హులను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయాలని నిరుపేదలు కోరుతున్నారు.

ఇళ్ల ఆక్రమణ..

ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో పది రోజుల క్రితం అసహనానికి గురైన 30 మంది నిరుపేద కుటుంబాలు ఇళ్లల్లోకి ప్రవేశించి, సామగ్రిని భద్రపరచుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ఇళ్ల పంపిణీ చేయకుండా చొరబడడం చట్ట విరుద్ధమని ప్రజలకు వివరించారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయిస్తామన్నారు. ఇళ్లల్లోకి చొరబడిన వారిని అధికారులు సముదాయించి బయటకు పంపించారు. అనంతరం రెవెన్యూ అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సీజ్ చేసి తాళాలు వేశారు.

కిరాయికి ఉంటున్నాం



మాకు ఉండడానికి సొంత ఇల్లు లేదు. ఎన్నో ఏళ్ల నుంచి కిరాయికి ఉంటూ జీవిస్తున్నాం. బీడీలు చుట్టగా వచ్చిన డబ్బులతోనే ఇంటి కిరాయి కట్టుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. గతంలో చాలాసార్లు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇల్లు ఇవ్వాలని కోరుతున్నాం.

– సబ్బని లక్ష్మి, ధర్పల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ధర్పల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో డ్రైనేజ్, సీసీ రోడ్డు, కరెంట్, మంచినీటి సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో పనులు కాలేవు. త్వరలోనే అసలైన అర్హులను గుర్తించి ఉన్నతాధికారుల సమక్షంలోనే పంపిణీ చేస్తాం. అప్పటివరకు ఎవరు ఇళ్లను ఆక్రమించొద్దు. అది చట్టరీత్యా నేరం అవుతుంది.

– మాలతి, తహసీల్దార్ , ధర్పల్లి

జిల్లాకు చేరిన ఐద్వా బస్సు యాత్ర



ఐద్వా నేతలకు ఆహ్వానం పలుకుతున్న స్థానిక నేతలు

నిజామాబాద్ సిటీ: ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర జిల్లాకు చేరింది. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నాందేవాడ సీపీఎం కార్యాలయానికి వచ్చింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశం మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడమేనన్నారు. అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం పోరాటాలు చేయాలన్నారు. పులే, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు అరుణజ్యోతి, ఆశలత, సాయిలీలతోపాటు జిల్లా నాయకులు సుజాత, అనిత, రజియా, మాధవి, కళావతి, స్వప్న పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	94,900	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	87,597		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	10	20
కాకరకాయ	50	90	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	75
కొత్తిమీర	30	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 ఓదెల–2(తెలుగు)–10.40, 1.30, 4.30, 7.20, 10.20
- స్క్రీన్-2 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)–11.00, 10.40
- ఒక్కడు(తెలుగు)–1.40, 7.40
- స్క్రీన్-3 అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి(తెలుగు)–11.00, 1.35, 4.30, 7.25, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి(తెలుగు)–10.00, 1.00, 4.00, 7.00, 10.00
- స్క్రీన్-2 ఓదెల–2(తెలుగు)–10.00, 1.05, 4.10, 7.15, 10.20
- స్క్రీన్-3 పాడింగ్టన్ (హిందీ)–11.05
- జాట్(హిందీ)–1.30
- సిన్నర్స్(ఇంగ్లీష్)–4.40, 7.40, 10.40
- స్క్రీన్ -4 డియర్ ఉమ(తెలుగు)–11.00
- ది చూసన్ లాస్ట్ సూపర్(ఇంగ్లీష్)–2.10
- జాక్(తెలుగు)–4.45– పాడింగ్టన్ (ఇంగ్లీష్)–7.40
- మధురం(తెలుగు)–10.05

లలితామహల్ కోర్ట్ (తెలుగు)

దేవి అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (తెలుగు)

నటరాజ్ జాట్(హిందీ), **విజయ్** మ్యాడ్ స్క్వేర్

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

డిచ్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మారం(బి), బర్ధిపూర్, మెంట్రాజ్పల్లి, దేవుపల్లి, దేవునగర్, నడిపల్లి, అమృతాపూర్ గ్రామాలోల్ల వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన/ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దాశరథి పురస్కారానికి ప్రేమ్‌లాల్ ఎంపిక



ప్రేమ్‌లాల్

నిజామాబాద్ రూరల్: జిల్లాకు చెందిన కవి, ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్ ప్రతిష్టాత్మక దాశరథి పురస్కారానికి ఎంపికయ్యాడని సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి దశరథి ఆర్గనైజషన్ కన్వీనర్ సతీష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 1న హైదరాబాద్‌లో పురస్కార ప్రదాన కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా కవులు అభినందనలు తెలిపారు.